బిల్లులు రాక.. పనులు సాగక


పెబ్బేరులోని కిష్టారెడ్డిపేట దగ్గర అసంపూర్తిగా ఉన్న వంతెన

- హైలెవల్ వంతెనలకు లభించని మోక్షం
- వర్షాలకు తెగుతున్న తాత్కాలిక వంతెనలు
- స్తంభిస్తున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం నుంచి కొల్లాపూర్ తో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో కిష్టారెడ్డిపేట, శేరుపల్లి శివారులో రూ.7.50 కోట్లతో, శ్రీరంగాపురం మండలం వెంకటాపురం శివారులో రూ.4 కోట్లతో రెండు హైలేవల్ వంతెనలు నిర్మాణానికి గత ప్రభుత్వం 2023 నవంబర్ 5న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ పనులకు టెండర్ వేసి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి రెండేళ్లు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో వంతెనలు అసంపూర్తి దర్శనమిస్తున్నాయి. పెబ్బేరు మండలం కిష్టారెడ్డిపేట శివారులో నిర్మాణం జరుగుతున్న 9 పిల్లరు, సైడు గోడల పనులు పూర్తి చేసి, 7 స్లాబ్ పనులు పూర్తి చేశారు. 3 స్లాబ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి సంబంధించిన 3 బిల్లుల్లో ఒక బిల్లు రావడం జరిగింది. 2 బిల్లులు పెండింగ్‌లో ఉండంతో చేసేది లేక కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలి వేశారు. శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో నిర్మాణం జరుగుతున్న హైలేవల్ వంతెన పనులు 4 పిల్లర్లు, రెండు సైడు గోడల నిర్మాణం పూర్తి చేశారు. కానీ స్లాబ్‌లు వేయలేదు. దీనికి సంబంధించిన రూ.2 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. నిత్యం ఈ రహదారిపై కొల్లాపూర్, పెంట్లవెల్లి వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్, శ్రీరంగాపురం మండలాలకు నిత్యం ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తుంటారు. వర్షాలు వచ్చినప్పుడల్లా వాగులు పొంగితే వంతెనల దగ్గర నిర్మించిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి రాకపోకలు ఆగిపోతున్నాయి. దీంతో రెండేళ్లుగా వంతెన నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడు అధికారులు నామమాత్రపు మరమ్మతు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇకనైనా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు వచ్చేలా చూడాలని, బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తయేలా చేయాలని ప్రయాణికులు, వాహనదారులు విజ్ఞప్తి చేశారు.

ఏటా వంతెనల వద్ద ఇబ్బందులే..



కిష్టారెడ్డిపేట దగ్గర వాగుపై నిర్మిస్తున్న హైలేవల్ వంతెనలు పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. డైవర్షన్ రోడ్డు తెగి పోవడంతో రెండు రోజులు వాహనాలను శ్రీ రంగాపురం నుంచి దారి మళ్లించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనుక త్వరగా వంతెనల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.
– పెద్దికోట్ల వెంకటేశ్వర్లు, పెబ్బేరు


వెంకటాపురం దగ్గర పిల్లర్లకే పరిమితమైన వంతెన పనులు

బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలి..



రెండేళ్ల క్రితం వంతెన పనులు ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవ డంతో పనులు మధ్యలో నిలిపేశారు. బిల్లులు త్వరగా వచ్చేలా ప్రజా ప్రతినిధులు చూడాలి.
– సి రాముడు, జానంపేట

వర్షాలతో ఆలస్యమవుతోంది..



వంతెనల నిర్మిస్తున్న సమయంలో వర్షాలు పడుతుండడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాం.
– దేశ్యా నాయక్, ఆర్అండ్బీ ఈఈ, వనపర్తి

క్లుప్తంగా

జాతీయస్థాయి కరాటేలో కొత్తకోట విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: హైదరాబాద్ ఉప్పల్ చిల్కానగర్‌లోని బొమ్మకు బాలయ్య గార్డెన్‌లో జరిగిన 29వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కొత్తకోట గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో దాదాపు 2000 మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనగా కొత్తకోట విద్యార్థులు పలు విభాగాల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విజేతలకు మాజీ మంత్రులు మల్లారెడ్డి, ఈటల రాజేందర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మాస్టర్ ఇంతియాజ్‌ను, విద్యార్థులను ఆల్ ఇండియా షైల్ చీఫ్ మల్లికార్జున్ గౌడ్, సదాశివం క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ, సీనియర్ మాస్టర్స్ జి.హరీష్ యాదవ్, జాఫర్ సాదిక్, ఎస్కే బాబా, అజ్మీర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

పాన్‌గల్: మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకుంటే బిల్లులు త్వరగా అందుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి, భూమి పూజ చేశారు. గ్రామానికి మొత్తం 30 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులు ఉంటే వారికి కూడా ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, రవికుమార్, భాస్కర్‌యాదవ్, పుల్లారావు, రాజుగౌడు, దశరథం, రాంచందర్, గోపాలకృష్ణ, బాలకృష్ణ, రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత బేస్‌మెంట్‌ను పరిశీలించిన ఎంపీడీఓ

వనపర్తి రూరల్: అధికారుల సూచన మేరకు మేరకు సోమవారం పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పాత బేస్‌మెంట్లను ఎంపీడీఓ రోజారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు బంద్

వనపర్తిటౌన్: రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపు మేరకు సోమవారం వనపర్తిలో కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. వనపర్తిలోని ప్రైవేట్, వృత్తి విద్య కళాశాలలు బంద్ పాటిస్తున్నాయని ప్రైవేట్ ప్రొఫెషనల్ కళాశాలల జిల్లా కన్వీనర్ టీపీ.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు వనపర్తి గాయత్రి పాలిటెక్నిక్, బీఎడ్, డీఎడ్ కళాశాలలు, వనపర్తి స్కాలర్స్ బీఎడ్ కళాశాల, వనపర్తి అమృత అక్షిత బీఎడ్, డీఎడ్ కళాశాల, వనపర్తి శర్వాణి డీఎడ్ కళాశాల, కొత్తకోట మానస బీఎడ్ కళాశాల, పెబ్బేర్ నవ భారతి బీఎడ్, విశ్వ భారతి డీఎడ్, నారాయణరెడ్డి బీఎడ్ కళాశాలలు బంద్‌లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో యువతి అదృశ్యం కాగా, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఏదుల మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన బంకల పూజ ఈనెల 13న హైదరాబాద్ వెళ్తున్నట్లు అని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. హైదరాబాద్ వెళ్లలేదని తెలియడంతో తండ్రి బంకల రాములు చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు రైతులు శివారెడ్డి, గోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి



వనపర్తిటౌన్: సమస్యలను ప్రజలకు తెలిసేలా వార్తలను రాస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తారా? అని టీయూడబ్ల్యూజేహెచ్ –143 సంఘం జిల్లా అధ్యక్షుడు బక్షి శ్రీధర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో జర్నలిస్టులపై పోలీస్‌లు అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

సమాజంలో ఇంజినీర్ల పాత్ర కీలకం


గాయత్రి పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

వనపర్తి: సమాజంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని గురురాఘవేంద్ర స్టీల్స్, సిమెంట్ డీలర్ మోహన్ అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్‌డే సందర్భంగా ఎంవైఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్అండ్‌బీ, పీఆర్, ఇరిగేషన్, సివిల్ ఇంజినీర్లను ఆహ్వానించారు. పలువురు ఇంజినీర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యా నాయక్, ఇరిగేషన్ శాఖ ఈఈ మధుసూదన్‌రావు, ప్లానర్స్ పూరిపాండు, ఇమ్రాన్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజినీర్‌గా దేశానికి చేసిన సేవలు మరువలేనివని గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య అన్నారు. కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, లెక్చరర్లు, రిటైర్డ్ ఇంజినీర్ వీరాచారి, కవులు, మహనీయుల స్ఫూర్తి వేదిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమ వారం కళాశాల ప్రిన్స్‌పాల్ జయచంద్ర అధ్యక్షతన ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ విజయభాస్కర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేతావత్ దశరథం నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై అవగాహన ఉండాలి

వనపర్తిటౌన్: ప్రభుత్వ చట్టాలు, పాలన విధానాలపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లెక్చరర్ కె.ఉమా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విస్తృత ఉపన్యాసకురాలు డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఉమా మాట్లాడుతూ ప్రభుత్వ విధాన విశ్లేషణపై ప్రతి విద్యార్థికి పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ దామోదర్ రెడ్డి, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆత్మకూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సోమవారం లబ్ధిదారులకు వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తులసీరాజ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, గణేష్, వెంకటన్న, గోపాల్, యాదయ్య, వీఎన్‌రావ్ ఉన్నారు.

ఆ పాఠశాలకు విద్యార్థులను పంపొద్దు

కొత్తకోట: కొత్తకోట పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేనందున, ఆ పాఠశాలను సోమవారం మరోమారు సందర్శించి అన్ని తరగతి గదులకు, ఆఫీస్‌కు తాళాలు వేసి సీజ్ చేసినట్లు మండల విద్యాధికారి జె.కృష్ణయ్య తెలిపారు. మూడు రోజుల క్రితం ఈ పాఠశాలను సందర్శించి ఆఫీస్‌కు తాళం వేసినప్పటికీ, పాఠశాల యాజమాన్యం విద్యార్థులను పిలిపించుకొని తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వనపర్తి డీఈఓ అబ్దుల్ ఘనీ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించి తరగతి గదులకు తాళాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి శ్రీ చైతన్య పాఠశాలకు తమ పిల్లలను పంపించవద్దని ఆయన సూచించారు.

అధికారుల సూచన మేరకు మందులు వాడాలి

ఖిల్లాఘనపురం: పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని పర్వతాపురం గ్రామ శివారులో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న మొత్తం ఏడు క్లస్టర్లలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. మండలంలో ఇప్పటికీ 21 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు అంచనా వేసినట్లు తెలిపారు.

రోబోటిక్స్ వర్క్‌షాప్

వనపర్తిటౌన్: సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్స్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ప్రాక్టికల్ రోబోటిక్స్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. సోహం అకాడమీ ఫౌండర్ కొమరగిరి సహదేవ్ మాట్లాడుతూ సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన జేఎస్‌టీయూ, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు మొత్తం 12 మందితో సెన్సార్ అండ్ ప్రోగ్రామింగ్‌పై 7,8,9వ, తరగతి విద్యార్థులు మొత్తం 127 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఖిల్లాఘనపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి చిన్న వయసు నుంచే టెక్నాలజీని అలవర్చుకోవాలని సోహం అకాడమీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రజినీకాంత్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కాళిదాస్‌లు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలోని 128 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ అందించారు. కార్యక్రమంలో రోబోటిక్స్ ఇన్‌చార్జి శ్రీనువాసులు, సైన్స్ ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, రామకృష్ణ, హీరాలాల్ పాల్గొన్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

కొత్తకోట: మూగ జీవుల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీఓకు ప్రజావాణి కార్యక్రమం ద్వారా వినతిపత్రం అందజేసినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గొర్రెల పెంపకం సహకార సంఘం అధ్యక్షుడు గొనికాడి రాములు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి గొర్రెలను కాపాడాలని, వర్షాల కారణంగా రోగాల బారిన పడుతున్న మూగజీవులకు సరైన వ్యాక్సిన్లు మందులు అందుబాటులో లేవని ప్రభుత్వాన్ని విమర్శించారు. దీని వల్ల మూగజీవులు మృత్యువాత పడుతున్నాయని, గొర్రెల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే ప్రభుత్వం గొర్రెల కాపరులను ఆదుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గోపాల్‌పేట: ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలోని డబుల్ బెడ్రూంలలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏదుల మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ముందు ధర్నా చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. వెంటనే స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజశేఖర్, మహేష్, ఈశ్వర్, శ్రీను, పాషా, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గొల్లకుంటను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలో సర్వే నంబర్ 243లో ఉన్న గొల్లకుంటను కాపాడాలని కోరుతూ సోమవారం రేమద్దుల వాల్యానాయక్‌తండా రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నం.243లో ఉన్న శిఖం భూమిలో ఉన్న గొల్లకుంటను మైనింగ్ తవ్వకాల పేరుతో ధ్వంసం చేస్తున్నారని, దీంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు, ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని, సమగ్ర విచారణ చేసి గొల్లకుంటను కాపాడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు లవుడ్య జగపతి, లవుడ్య సురేష్ పాల్గొన్నారు.

దాతలకు ఘన సన్మానం



పాన్‌గల్: మండలంలోని మాదరావుపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం వీరస్వామి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతకు వందనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్ఎం పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు చేస్తున్న కృషిని గమనించి గ్రామానికి చెందిన 13 మంది దాతలు ముందుకొచ్చి పాఠశాలకు ఫర్నీచర్, గోడలకు అందమైన బొమ్మలు, జాతీయ నాయకుల చిత్రాలు గీయించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటునందించిన దాతలు ఖగేందర్‌రెడ్డి, బొరెల్లి రాంచందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖర్, భీముడు, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజారెడ్డి, బొరెల్లి చంద్రయ్య, బాలపీరు, వెంకటయ్య, గురువయ్య, రాజయ్య, కుర్మయ్య తదితరులను సన్మానించారు. పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎంను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మి, దాతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల కార్యవర్గానికి సన్మానం



కొత్తకోట రూరల్: కొత్తకోట మండల గౌడ సంఘం మండల అధ్యక్షుడితో పాటు కార్యవర్గానికి మిరాసిపల్లి గ్రామ గౌడ సంఘం సభ్యులు సోమవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్‌ను, ఇతర కార్యవర్గ సభ్యులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మండలంలో గౌడ సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని, గీతా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు. సన్మాన కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, జీవన్‌గౌడ్, జ్ఞానేష్‌గౌడ్, తారకేశ్వర్‌గౌడ్, రాముగౌడ్‌తో పాటు పట్టణ గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుకు సమగ్ర సర్వే

- కలెక్టర్ ఆదర్శ్ సురభి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: మండలంలోని పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలం కోసం సమగ్ర సర్వే చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటు విషయంపై డీఎఫ్ఓ అరవింద్ ప్రసాద్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు చేసేందుకు ఎంత మేర స్థలం అవసరం అవుతుందని విద్యుత్ అధికారులను ఆరా తీశారు. లైన్ వెళ్లే మార్గంలో అటవీ స్థలం ఎంత ఉంది, ఇతర భూమి ఎంత మేర ఉంటుందని తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా సమగ్ర సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే అనంతరం కావలిసిన స్థలానికి సంబంధించి లొకేషన్ మ్యాప్, నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. లైను ఏర్పాటు చేసే సమయంలో విద్యుత్ అధికారులు అవసరం మేరకే కొమ్మలను తొలగించాలని కలెక్టర్ సూచించారు. కొమ్మలను తొలగించే ముందు అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజశేఖర్, ఇ సెక్షన్ సూపరింటెండెంట్ సునీత, జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్/గోపాల్‌పేట/ఆత్మకూర్: ఆయా మండలాల్లో రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. రోజూ పంపిణీ చేస్తున్నా రైతుల రద్దీ మాత్రం తగ్గడంలేదు. సోమవారం పాన్‌గల్ సింగిల్ విండో కార్యాలయానికి 900 బస్తాల యూరియా రావడంతో ముందు టోకెన్లు తీసుకున్న వారికి పోలీసుల పర్యవేక్షణలో యూరియాను పంపిణీ చేశారు.

- గోపాల్‌పేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ దగ్గరికి రైతులు యూరియా కోసం పెద్దమొత్తంలో వచ్చారు. ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టి వేచిఉన్నారు. అధికారులు రైతులకు యూరియా కొరత లేకుండా ఇవ్వాలని కోరారు.
- ఆత్మకూర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా కోసం బారులు తీరారు. పీఏసీఎస్ వద్ద నిత్యం ఇదే పరిస్థితి ఉంటోంది. మండలంలోని రైతులు పడిగాపులు కాశారు.

అమరచింత: రైతులు యూరియా కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం మాట్లాడారు. తహసీల్దార్ రవికుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కంపుతో విద్యార్థులు అనారోగ్యం పాలు అవుతున్నారు. ఈ విషయంపై సోమవారం 'డంపింగ్‌యార్డు కంపు కంపు' కథనంతో 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. స్పందించిన ఎంపీడీఓ సునిత, ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శి రవితేజతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. విద్యార్థులతో పాటుగా రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని అధికారులు గ్రహించారు. ఇక నుంచి గ్రామంలోని చెత్త, కోళ్ల వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేయొద్దని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ ఆదేశించారు. నూతనంగా గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు కావలిసిన స్థలం కోసం తహసీల్దార్ సుగుణకు లెటర్ పెట్టడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు మరో ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలతో అధికారుల పరుగులు


మామిడిమాడ గ్రామంలో విజయలక్ష్మి ఇంటి దగ్గర పరిశీలిస్తున్న తహసీల్దార్

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ గ్రామంలో బోయ విజయలక్ష్మి ఇంటి ముందు వర్షం నీరు నిలిచింది. వ్యవసాయ పొలాల నుంచి వర్షం నీరు పెద్ద ఎత్తున వచ్చి ఆమె ఇంటి ముందు మోకాళ్ల ఎత్తున నిలుస్తోంది. ఈ విషయం ఆమె గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లింది. గ్రామపెద్దలు ఎవరూ పట్టించుకోకపోవడంతో వాట్సాప్ గ్రూపులో ఫొటోలు పెట్టడంతో పాటు పాటు కాల్వను పూర్చడం వల్లనే తన ఇంటి ముందు ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆడియోలు పెట్టింది. అయినా ఎవరూ స్పందించక పోవడంతో కలెక్టర్ దృష్టికి తన సమస్యను తీసుకెళ్లింది. స్పందించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి వెంటనే మండల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశంతో సోమవారం తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ సునిత, ఎంపీఓ రాజులు పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. మహిళ ఇంటి దగ్గరకు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. వరి పొలాల నుంచి పెద్ద ఎత్తున నీరు రావడంతో మహిళ ఇంటి ముందు నిలుస్తున్నట్లు గుర్తించారు. చేసేది లేక వెంటనే మొర్రం పోయించి నీళ్లు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ విజయలక్ష్మి ఇంటి ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా ఉందని, వర్షం వచ్చిన సమయంలో ఎక్కువ నీళ్లు రావడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో మొర్రం వేయించి సమస్య లేకుండా చేశామన్నారు. పాటు కాల్వ విషయం రికార్డుల్లో పరిశీలిస్తామన్నారు.

పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తాం



పాన్‌గల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాడుతుందని జిల్లా కార్యవర్గ సభ్యు లు కళావతమ్మ, శ్రీరామ్ అన్నారు. సోమవా రం మండలంలోని కేతేపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి కమ్యూనిస్టు యోధులు రావి నారాయణరెడ్డి, మగ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సోయా బుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూర్: నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచారని సీపీఐ జిల్లా నాయకుడు శ్రీహరి, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి అన్నారు.

వీపనగండ్ల: సాయుధ తెలంగాణ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ వారోత్సవాల సందర్భంగా ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాం, కృష్ణవేణి, కురుమయ్య, వంక గోపాల్, వెంకటేష్, చందు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలని ధర్నా


పాన్‌గల్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆసరా, దివ్యాంగుల పింఛన్లు పెంచాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ ఎస్ జిల్లా సీనియర్ నాయకులు గంధం లక్ష్మయ్య, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు పరుశరాముడు మా ట్లాడారు. ఇచ్చిన హామీని అమలు చేసే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి అందజేశారు.

కొత్తకోట రూరల్: దివ్యాంగుల పింఛన్ పెంపు కోసం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వామన్‌గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డిలు అన్నారు. తహసీల్దార్ యం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో పింఛన్లు దివ్యాంగులకు, వృద్ధులకు రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

వనపర్తిటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య, సీనియర్ నాయకుడు గంధం గట్టయ్య డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ఎద్దుల వెంకటేష్ అధ్యక్షత తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆత్మకూర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు.

ఖిల్లాఘనపురం: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గొరిపాగ లక్ష్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందించారు.